www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 28 అక్టోబర్ 2024

5




## కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పెరుగుతున్న పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికులను నియమించి, పనిముట్లు రక్షణ పరికరాలు వంటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు పిలుపుమేరకు నిమ్మకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలిపారు. అవసరమైన పని ముట్లు, వాహన మరమ్మతుల నిమిత్తం బడ్జెట్ కేటాయించాలని, కార్మికులకు చట్టబద్ధమైన సెలవులు మంజూరు చేయాలన్నారు. అనంతరం చైర్మన్ కె.ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

# సర్దుపోటు

- యూనిట్‌పై రూ.1.55 అదనం
- డిసెంబరు నుంచి వసూలుకు గ్రీన్ సిగ్నల్
- విద్యుత్ వినియోగదారులపై రూ.10 కోట్లకు పైగా భారం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపునకు రంగం సిద్ధమైంది. ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు ఛార్జీల పేరిట వినియోగదారుల నుంచి మరో 15 నెలల పాటు అదనపు వసూలు చేసుకునేలా ఎపి విద్యుత్ నియంత్రణ మండలి నుంచి ఎపిఇపిడిసిఎల్‌కు అనుమతులు ఇచ్చింది. దీంతో సామాన్యుడికి ప్రతి నెలా విద్యుత్ ఛార్జీల షాక్ తగలనుంది. ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చును ప్రభుత్వం భరిస్తే ఛార్జీల పెంపు ఉండదు. కానీ ఈ సర్దుబాటు భారాన్ని తాము మోయలేమంటూ నూతన ప్రభుత్వం మొండి చేయి చూపించింది. దీంతో విద్యుత్ ఛార్జీల భారం జనం నెత్తినపడనుంది. 2022-2023లో వాడిన కరెంటుకు ఈ ఈ నవంబర్ నుంచి 2026 జనవరి వరకూ సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయనున్నారు.

ఈ క్రమంలో గరిష్టంగా యూనిట్‌కు రూ.1.55 వరకు విద్యుత్ చార్జీలు పెరిగే అవకాశాలున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా జనాల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదునెలల్లోనే ఇలా సర్దుబాటు ఛార్జీల రూపంలో ప్రజలపై భారం మోపడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన హామీని ప్రభుత్వం తుంగలో తొక్కింది.




**జిల్లాపై సుమారు రూ.10 కోట్ల భారం**

ఉమ్మడి జిల్లాలో 19.16లక్షల విద్యుత కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహాలకు సంబంధించి 16.23 లక్షల గహాల కనెక్షన్లు ఉన్నాయి. వీటితోపాటు, వాణిజ్యం, పరిశ్రమలు, తాగునీటి కనెక్షన్లు, వీధిలైట్లు తదితర కనెక్షన్లు 3.07 లక్షలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రోజువారీగా 20 మిలియన యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఇంతవరకూ ఈ విద్యుత్ కనెక్షన్‌ల నుంచి విద్యుత్ వినియోగం దృష్ట్యా అన్ని రకాల ఛార్జీలతో కలిపి సుమారు రూ.205 కోట్ల వరకూ డిమాండ్ కాగా తాజాగా మరో రూ.10 కోట్లు అదనంగా డిమాండ్ పెరగనుందని అంచనా.

**పెరుగుదల ఇలా...**

ఇంతవరకు గృహ వినియోగదారునికి నెలకు 30 యూనిట్‌ల లోపు వరకు యూనిట్ రూ.1.90 వసూలు చేస్తున్నారు. తాజాగా ఇంధన సర్దుబాటు ఛార్జీలతో కలిపి ఇదే యూనిట్‌కు కనిష్ఠంగా రూ.3.20 వరకు వసూలు చేయనున్నారు. అలాగే 400 యూనిట్ల వరకు నమోదైన వినియోగదారునికి యూనిట్ ధర ప్రస్తుతానికి రూ.9.75 కాగా ఇక యూనిట్ ధర రూ.12.30 వరకు పెరగనుంది. అంటే ప్రస్తుతం చెల్లించే నెలవారీ కరెంటు బిల్లుకు దాదాపు రెట్టింపు ఛార్జీల చెల్లించాల్సి వస్తుంది.

**ఎన్నికల ముందు హామీ బుట్టదాఖలు**

విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఎన్నికల ముందు టిడిపి అధినేత చంద్రబాబు కొవ్వూరులో నిర్వహించిన బహిరంగ సభలో తొలిసారిగా ప్రకటించిన విషయం విధితమే. ఉభయ గోదావరి జిల్లాపై కూటమి కేంద్రీకరించి ఓటర్లను ఆకర్షించింది. ఆశించిన విధంగానే అత్యధిక మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. అయితే అధికారంలోకి వచ్చిన నాలుగు నెల్లోనే సర్దుపోటుకు తెరలేపటం వినియోగదారులతో పాటు ఆ పార్టీ శ్రేణులలోనూ కలవరం మొదలైంది. ఇప్పటికే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్న విషయం విధితమే. తాజా పరిస్థితుల నేపథ్యంలో వినియోగదారుల ఆగ్రహానికి గురవక తప్పదనిసుస్పష్టం. దీంతో అధికార పార్టీ నేతలు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.


సమావేశంలో డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్న 104 ఉద్యోగులు

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగులు డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా 104 ఎంఎంయు యూనియన్ సమావేశం ఆదివారం అమలాపురం యుటిఎఫ్ భవనము నందు నిర్వహించారు. ఈ సమావేశానికి 104 అధ్యక్షులు పి.చంద్రశేఖర్ అధ్యక్షతన వహించగా జిల్లా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకే వెంకటేశ్వరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం,104 ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ఓం ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 104 సేవలను ప్రభుత్వం పి హెచ్‌సి ద్వారా నిర్వహించాలన్నారు. డిఎస్ఆర్, ఆర్ఒఆర్ లుగా గత 16 సంవత్సరాలుగా (2008) సుదీర్ఘ కాలం గా సేవలను అందిస్తున్న 326 మందిని వైద్య , ఆరోగ్య ఇతర శాఖలలో కాంట్రాక్టు డ్రైవర్ లుగా నియమించాలని, సీనియర్ డ్రైవర్ లకు శ్లాబ్ ప్రకారం వేతనాలు అమలు చేయాలి అని, 2020 సంవత్సరం నుంచి పనిచేస్తున్న డ్రైవర్లకు, డిఇఒలకు అందరికీ ఉద్యోగ భద్రత కల్పించి సమానం పనికి సమాన వేతనం అమలు చేయాలి అని డిమాండ్ చేశారు. ఇతర కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు వలె రిటైర్ మెంట్ 60 సంవత్సరాలు నుంచి 62 సంవత్సరాలు వరకు పెంచాలన్నారు. డిఇఒలకు వారి పేరుపై కంప్యూటర్ లాగిన్ కేటాయించాలి అని వారు విధులు నిర్వహించడానికి ఆరు నెలల సెల్ రీఛార్జ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. 3 నెలల నుండి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నార. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి అని, వేతనాలను నెలనెలా సకాలంలో చెల్లించేలా చర్యలు చేపట్టాలి అని అన్నారు. చట్ట ప్రకారం యాజమాన్యం కట్టవలసిన పిఎఫ్‌ను యాజమాన్యం ద్వారా కట్టించాలని, చట్ట ప్రకారం అమలు చేయవలసిన లీవ్‌లను అమలు చేయాలి అని ప్రభుత్వ సెలవులను వర్తింపజేయాలన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న వారికి బదిలీలకు అవకాశం కల్పించాలని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి అని బఫర్ ఉద్యోగులకు 26 రోజులకు టిఎ, డిఎలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్య క్షులు ఎల్.రాజ్‌కుమారి, ఎం.జగ్జీవన్‌రావు పాల్గొన్నారు.

## పంట కాలువ ఆధునికీకరణకు వినతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం ప్రధాన పంట కాలువను ఆధునికీకరించాలని రైతుల, గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తిచేశారు. ఉప్పలగుప్తం ప్రధాన పంట కాలువలో దట్టమైన తూడు, చెత్త పెరిగి సాగునీరు ప్రవహించేందుకు ఆటంకంగా మారడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల, పాలకులు వంటకాలువలో తూడు, చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టలేదని రైతులు, గ్రామస్తులు అన్నారు. ఈ పంట కాలువను అనుకుని ఉన్న నివాస ప్రజలకు పశువుల తాగేందుకు, వాడుకునేందుకు నీరు ఉపయోగకరంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పాలకులు సంబంధిత అధికారులు పంట కాలువ దుస్థితిని పట్టించుకోకపోవడంతో పంట కాలువ మూసుకుపోయే పరిస్థితి వచ్చిందని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వంటకాలువపై సుమారు 500 ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా ఉప్పలగుప్తం, చీకట్లపాలెం, బడుగుపేట, మధురపేట పేరాయిచెరువు, ఏటిమెరక, ఆదిలక్ష్మి పురం గ్రామస్తుల ప్రజలకు అన్నింటికీ ఈ పంట కాలువ నీటిపైనే ఆధారపడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.


ఉప్పలగుప్తం ప్రధాన పంట కాలువ దుస్థితి

ఇప్పటికైనా పాలకులు, అధికారులు పంట కాలువపై దష్టి సారించి పంట కాలువను ఆధునికరించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు, ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

### 108లో శిశువు జననం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిధిలోని గంటి గ్రామానికి చెందిన కడలి కృష్ణకుమారికి పురిటి నొప్పులు అధికమవడంతో 108కి సమాచారం అందించారు. రావులపాలెం 108 సిబ్బంది ఆమెను హాస్పిటల్ కు తరలిస్తుండగా పురిటినొప్పులు అధికమవడంతో అంబులెన్స్‌లోని ఆమె శిశువును ప్రసవించింది. అంబులెన్సు టెక్నీషియన్ జి. నాగరాజు డెలివరీ కండక్ట్ చెయ్యగా శిశువు ఎదురుకాళ్ళతో పేగు మెడకు చుట్టుకుని జన్మించింది. ఎదురుకాళ్ళతో పుట్టడం వల్ల శిశువు ఆరోగ్య స్థితి విషమించడంతో టెక్నీషియన్ సమయస్ఫూర్తితో శిశువుకు అత్యవసర వైద్యం అందించడంతో ప్రాణాపాయ స్థితి నుండి బయటపడింది. తల్లిని, శిశువును తదుపరి వైద్య సహాయం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. రావులపాలెం108 అంబులెన్సు సిబ్బంది, ఇఎమ్‌టి గూడపాటి.నాగరాజు, పైలెట్ కుంచె.ప్రదీప్ పాల్గొన్నారు.


శిశువుతో 108 సిబ్బంది

## సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకే చెకుముకి పోటీలు

### మలికిపురంలో జిల్లా స్థాయి చెకుముకి పోటీలు

ప్రజాశక్తి-రాజోలు

విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించడంతో పాటు సైన్స్‌పై ఆసక్తిని పెంచడానికి చెకుముకి సైన్స్ పోటీలు దోహదం చేస్తాయని మలికిపురం మండల ఎంఇఒలు విజయశ్రీ, వైవి. సత్యనారాయణ అన్నారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ మలికిపురంలోని ఎంవిఎన్‌జెఎస్ అండ్ ఆర్ విఆర్ డిగ్రీ కాలేజీలో వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చెకుమకి సైన్ సంబరాలు నిర్వహించడంలో ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులను శాస్త్రీయ దక్పథం వైపు నడిపించి తద్వారా సమాజాన్ని పట్టిపీడిస్తున్న మూఢనమ్మకాలు విశ్వాసాల నుంచి ప్రజలను జాగ్రత్త చేయాలని తెలియజేశారు. తొలి దశలో అన్ని స్కూళ్ల, అన్ని మండల, పట్టణ స్థాయిలో నిర్వహించిన పోటీల విజేతలు దాదాపు 50 టీములు జిల్లా స్థాయి పోటీ పరీక్షల్లో పాల్గొని తమ ప్రతిభ నిరూపించుకున్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వానపల్లి టీమ్ ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రయివేటు పాఠశాల విభాగంలో కొత్తపేట భాష్యం స్కూల్ టీం జిల్లా ప్రథమ స్థాయిలో నిలిచి రాష్ట్ర స్థాయికు అర్హత సాధించారు. ఈ రెండు టీంలు త్వరలో విశాఖపట్నం లో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాల్లో జిల్లా తరపున పోటీ పడతారు. కార్యక్రమంలో డిస్టిక్ సైన్స్ ఆఫీసర్ జివిఎస్.సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ ఎఎఫ్‌డిటి ట్రస్ట్ ఎంవి.సత్య నారాయణమూర్తి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మొహిద్దిన్, జెవివి జిల్లా కార్యదర్శి కార్యక్రమ నిర్వాహకులు వివేకానంద విద్యాసంస్థల కరస్పాండెంట్ పివివివి.వరప్రసాద్, జిల్లా కల్చర్ కన్వీనర్ సిహెచ్.తులసిరావు, జిల్లా యుటిఎఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ జనరల్ సెక్రెటరీ ఎన్.విశ్వనాథం మల్కిపురం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ .బి.ఝాన్సీ బాయ్, బి.శ్రీనివాసరావు, తాడి సహదేవ్, బోణం రాజు పలువురు పాల్గొన్నారు.


పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంస పత్రాల అందజేత

## ఇటుక బట్టీల భూమికి ఈ-క్రాప్

### ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజావేదికలో ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఇటుకలు బట్టీలు నిర్వహిస్తున్న మూడున్నర ఎకరాల భూమిని భూ యజమాని ఈక్రాప్ లబ్ధి పొందుతూ ప్రభుత్వాన్ని అధికారులను మోసగించడంపై ఈనెల 26వ తేదీన సిఎం చంద్రబాబుకు ప్రజా వేదికలో ఫిర్యాదు చేశామని రామచంద్రపురం చెందిన వానపల్లి దొరబాబు 'ప్రజాశక్తి' దినపత్రికకు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. ఉట్లపల్లి గ్రామంలోని రామానుజుల శేషగిరిరావు సీతామహాలక్ష్మికి చెందిన భూమిని 2004లో ఇటుక బట్టీలు అద్దెకి ఇచ్చారని అన్నారు. అయితే అప్పటినుంచి ఆ భూమిని పంట భూమిగా నమోదు చేసుకుని పొందుతున్నారని ఆయన వివరించారు. దీనిపై వ్యవసాయ అధికారులకు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోలేదన్నారు. గత మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ అనుచరుడైన శేషగిరిరావుతో కలిసి తనకు సంబంధించిన సుమారు రూ.15 లక్షలు విలువైన ఇటుకను పట్టుకుపోయారని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని దొరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ విధమైన లైసెన్సు లేకుండా ఇటుక బట్టీలు నడపడమే కాకుండా ఈ క్రాప్ కూడా లబ్ధి పొందుతూ అధికారులను తప్పుదోవ పట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఆర్‌డిఒ, తహశీల్దార్, విఆర్‌ఒ, ద్రాక్షారామం ఎస్ఐ, రామచంద్రపురం సిఐ, డిఎస్‌పిలపై, ఇతర అధికారుల పైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కి అందజేసిన ఫిర్యాదులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా దొరబాబు 'ప్రజాశక్తి'కి తెలిపారు.


ఇటుక బట్టీల భూమికి పంట భూమి గా ఈ క్రాప్ పొందుతున్న భూమి ఇదే


సిఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న దొరబాబు

### షర్మిలను కలిసిన పి.గన్నవరం కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాశక్తి - మామిడికుదురు

విజయవాడలో జరిగిన పిసిసి అధ్యక్షురాలు వైయస్.షర్మిలను డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో పి గన్నవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమావేశంలో కలిశారు. ఈ సందర్భంగా షర్మిల వారితో మాట్లాడుతూ గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలని వివరించారు భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ లభిస్తుందని ఆమె భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్, రాష్ట్ర ట్రయినింగ్ కమిటీ ఛైర్మన్ జంగా గౌతమ్, జిల్లా అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు, పిసిసి మెంబర్ మాసవరపు శివన్నారాయణ, మామిడికుదురు మండల శాఖ అధ్యక్షులు అప్పన శ్రీరామకృష్ణ. కొండేటి వెంకటేశ్వరరావు బొంతు రాజేంద్రప్రసాద్, నేతల నాగరాజు, నాగవరపు నాగరాజు,చిట్టాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పిసిసి అధ్యక్షురాలు షర్మిలతో పి.గన్నవరం కాంగ్రెస్ పార్టీ నాయకులు

## బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - ఆలమూరు

దీపావళి వేడుకల్లో భాగంగా మందు గుండు సామగ్రి తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోడౌన్లు, విక్రయించే దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్థానిక ఎస్ఐ ఎం.అశోక్ అన్నారు. రానున్న దీపావళి వేడుకలకు మందు గుండు సామగ్రి వినియోగంపై మండల కేంద్రం లోని పోలీస్ స్టేషన్లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక తదితర శాఖల నిబంధనల ప్రకారం అనుమతులు పొంది జాగ్రత్తలను విధిగా పాటించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా బాణసంచా సామగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు నివాసాలకు నిర్దేశించిన దూరంలో తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే అనుమతులు పొందిన షాపు యజమానులు జన సంచారం లేని చోటన, విశాలమైన ఖాళీ ప్రదేశంలో విక్రయించు కోవాలన్నారు. జనవాసాలకు, విద్యాసంస్థలకు, ఆల యాలకు, ఆసుపత్రులకు దూరంగా బాణసంచా నిల్వలు ఉండాలన్నారు. ప్రతి దుకాణం వద్ద ఫైర్ డిస్టింగేటర్లు, బకెట్లల్లో పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉండాల న్నారు. లైసెన్సు లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేసినా, నిల్వ చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అశోక్ హెచ్చరించారు.


అశోక్, ఎస్ఐ


మాట్లాడుతున్న విదసం నేతలు, పాల్గొన్న బాధితులు

### దళితుల కేసులన్నీ పునర్విచారణ చేయాలి


ప్రజాశక్తి - అమలాపురం రూరల్

దళితులపై గత ప్రభుత్వం చేసిన హత్యలు, దాడుల కేసులను కూడా పునర్విచారణ చేయాల్సిందేనని విదసం ఐక్య వేదిక (విస్తత దళిత సంఘాల ఐక్య వేదిక) రాష్ట్ర సమితి సమన్వయ కర్త డాక్టర్ బూసి వెంకట రావు డిమాండ్ చేశారు. ఆదివారం అమలాపురం మండలం ఈదరపల్లి అంబేద్కర్ భవన్ లో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు, విదసం ఐక్యవేదిక రాష్ట్ర కో కన్వీనర్ రేవు తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన విదసం రాష్ట్ర సమితి సమావేశంలో ఈ మేరకు తీర్మానం చెసి ముఖ్యమంత్రి దష్టికి తీసుకు వెళ్తామని వెంకటరావు తెలిపారు. సభకు ముందు బాధితుల కుటంబ సభ్యులు కోడి కత్తి శ్రీను, తల్లి జనపల్లి సావిత్రమ్మ , అన్న సుబ్బరాజు , అనంత బాబు చేతిలో హత్యకు బలైన వీధి సుబ్రమణ్యం తల్లి నూక రత్నం, సత్యనారాయణ, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు చేతిలో శిరోముండనం భాదితులు దడాల వెంకట రత్నం, పట్టాభి, మాజీ ఎంఎల్ఎ జగ్గి రెడ్డి బాధితులు వాసు, విజయ కుమార్ బెనర్ల తో ప్రదర్శన చేశారు. బాధితులు తమ తమ కేసుల గురించి మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని, ప్రభుత్వం పునర్విచారణ జరపాలని కోరారు. కార్యక్రమంలో విదసం నాయకులు ఓంకార్, ప్రసాద్, కొనసీమ జిల్లా దళిత సం ఘాల ఐక్య వేదిక నాయకులు రాజమణి, దుర్గారావు, నాగబత్తుల ప్రసాద్, అయితా బత్తుల ఉమామహేశ్వరరావుతదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించకపోతే చర్యలు

**రాజోలు :** దీపావళి నేపథ్యంలో బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని రాజోలు ఎస్ఐ బి.రాజేష్ కుమార్ అన్నారు. ఆదివారం తమ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'ఎక్కడా బాణసంచా పేలుళ్ల జరగకుండా ప్రశాంతంగా దీపావళి చేసుకునేలా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. బాణసంచా విక్రయాల సమయంలో వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలి. సామగ్రి భద్రపరిచిన గొడౌన్లు, దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఇసుక, ఫైర్ ఇంజిన్ తప్పనిసరిగా అందు బాటులో ఉంచాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో దుకా ణానికి 5 నుంచి 10 అడుగుల దూరం పాటించాలన్నారు. పరిమితికి మించి మందుగుండ సామగ్రి నిల్వ ఉంచరాదన్నారు. బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ రాజేష్‌కుమార్ అన్నారు.


బి.రాజేష్‌కుమార్




## గజవాహనంపై దర్శనమిచ్చిన కోనేటిరాయుడు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏడవ రోజు రాజాధిరాజ అలంకారంలో భక్తవత్సలుడు గజవాహనంపై యాత్రికులకు దర్శనమిచ్చాడు. ఉదయం నుండి వేద పండితులు ఖండవల్లి ప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జగత్కళ్యాణ నిమిత్తము శ్రీనివాసకళ్యాణము ఘనంగా జరిగింది. ఎంఎల్ఎ బండారు సత్యనారాయణరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ డిసి నల్లం చక్రధర రావు దంపతులు, ముదునూరి వెంకటరాజు దంపతులు, లొల్ల గ్రామ సర్పంచ్ కాయల జగన్నాథం దంపతులు బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు రాజాధిరాజ అలంకరణతో గజ వాహన పై వెంకన్న ఆలయ మాడవీధుల్లో విహరించారు. అధికా సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.


రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై శ్రీనివాసుడు

### ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు

**ఆలమూరు:** వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలి వెళ్లేందుకు ఆదివారం సాయంత్రం చెముడులంక నేతాజీ స్కూల్ ఆధ్వర్యంలో నాలుగు ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు, మండలంలోని 18 గ్రామాల్లోని భక్తులను ఈ బస్సుల ద్వారా వాడపల్లి ఉచితంగా తీసుకుని వెళ్లారు. సోమవారం ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని వారు తెలిపారు.


వాడపల్లి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న బస్సు

### బివి.రమణయ్య సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పిఐ) ఎంఎల్ఎ గా దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన దివంగత ఎంఎల్ఎ బివి.రమణయ్య సేవలు చిరస్మరణీమని పలువురు వక్తలు అన్నారు. వానపల్లిపాలెం పంచాయతీ బివి.రమణయ్య నగర్ లో ఆదివారం రమణయ్య విగ్రహాన్ని మాజీ సర్పంచ్ నక్కా నాగేంద్రుడు ఆవిష్కరించారు. రమణయ్య విగ్రహానికి స్థానిక సర్పంచ్ నల్లా బాబండి, ఉప సర్పంచ్ కొల్లు చిన్నారి శ్రీనివాస్, వార్డు సభ్యులు గుత్తాల దుర్గ బుజ్జిబాబు, మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి, దళిత నాయకులు పెయ్యల పరశురాముడు, కాశి వెంకటరమణ, జంగా బాబురావు, పెయ్యల శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బివి రమణయ్య కమిటీకి చెందిన పినిపే నాగేశ్వరరావు, కొల్లి వెంకటరావు, మెండి రాజేష్,పెట్టా శ్రీనివాసరావు, కొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బివి.రమణయ్య విగ్రహం వద్ద దళిత నాయకుల నివాళి

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

**ప్రజాశక్తి - గోపాలపురం**

ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టుకున్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జగన్నాథపురంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కరిచర్లగూడెం గ్రామానికి చెందిన రాయి రాజశేఖర్ అయ్యాపురంలోని అత్తవారి ఇంటి నుంచి తన కుమార్తె, కుమారుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై కరిచర్లగూడెం వస్తున్నారు. జగన్నాథపురం శివారు సచివాలయం వద్దకు వచ్చే సరికి జాతీయ రహదారిపై గోపాలపురం నుంచి కొయ్యలగూడెం వైపు వెళుతున్న స్కూటీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజశేఖర్, అతని కుమార్తె అక్షయ, కుమారుడు మధుకిరణ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108 ఆసుపత్రికి తరలించారు. స్కూటీపై ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి గాయాలు కావడంతో జంగారెడ్డిగూడెంలో ప్రైవేటు ఆసుపత్రిలో తరలించారు. రాజశేఖర్ భార్య రాయి అంజలి పోలీసులకు సమాచారం ఇచ్చింది.

### కాలువలో పడి వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-పిఠాపురం**

మండలంలోని వెల్దుర్తి గ్రామానికి చెందిన వ్యక్తి గొర్రిఖండి కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా. వెల్దుర్తి గ్రామానికి చెందిన వి.సూర్యనారాయణ (32) శనివారం రాత్రి బహిర్భూమికి వెళ్ళి గొర్రిఖండి కాలువలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి గల్లంతయ్యాడు. స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు గాలించగా ఆదివారం కొద్దిసేపటికి సూర్యనారాయణ మృతదేహం లభ్యం అయింది. పోలీసులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ గుణ శేఖర్ తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

### ప్రేమ పేరుతో మోసగించిన యువకునిపై కేసు

**ప్రజాశక్తి-కోటనందూరు**

కె.మల్లవరం గ్రామానికి చెందిన ఒక బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన యువకునిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఈ సంఘటనపై ఆదివారం పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు గ్రామంలో బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, బాలికతో మాట్లాడారు. అదే గ్రామానికి చెందిన రాపాక ప్రసాద్‌పై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రసాద్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

# సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులు

## ప్రజాశక్తితో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు



**ప్రజాశక్తి - అమలాపురం**

ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లాలో ప్రతి గ్రామంలోకి బస్సు రూట్ నడిపేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. నవంబర్ ఒకటవ తేదీ నుండి కార్తిక మాసం సందర్భంగా పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. కోనసీమలో ప్రత్యేకంగా వెలసిన ఏకాదశ రుద్రుల దేవాలయాలు కూడా ప్రత్యేక బస్సులు కేటాయించామని మన్య సీమ పేరుతో రంపచోడవరం, మారేడుమిల్లి తదితర ప్రాంతాల్లో టూరిజనాకి సంబంధించి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆయన తెలిపారు .ప్రత్యేకంగా అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తుల సౌకర్యార్థం శబరిమల కూడా అమలాపురం నుంచి శబరిమలకు ఆర్‌టిసి బస్సులు నడుపుతున్నట్లు శ్రీనివాస రావు తెలిపారు. అమలాపురం నుంచి 329 బస్సు సర్వీసులు నడుపుతున్నామని వీటిలో ప్రధానంగా హైదరాబాద్, వైజాగ్, విజయవాడ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా జిల్లా వాసులు ఉంటున్న నేపథ్యంలో అధిక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్‌టిసికి సంబంధించిన పలు వివరాలతో ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

**పంచారామాలు, ఏకాదశ రుద్రులు, శబరిమల యాత్రలకు ఎటువంటి ఏర్పాట్లు చేశారు?**

అమలాపురం నుంచి ప్రతి ఏటా కార్తికమాసంలో పంచారామాల పేరుతో బస్ సర్వీస్ నడుపుతున్నాం. దీని టికెట్ ఖరీదు రూ.950. అలాగే అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తుల కోసం శబరిమలకు రూ.5 వేల టికెట్ తో ప్రత్యేక సర్వీస్ నడుపుతున్నాము. అలాగే కోనసీమ ప్రాంతంలో ఉన్న ఏకాదశ రుద్రులు క్షేత్రాలకు నామినల్ రుసుముతో బస్సులు నడుపుతాము.

**అమలాపురం ఇతర ప్రాంతాలకు సర్వీసులు ఎలా నడుస్తాయి.?**

జిల్లాలో అమలాపురం రాజోలు రామచంద్రపురం రావులపాలెం ఆర్‌టిసి డిపోల పరిధిలో హైదరాబాద్ పాటు విశాఖ, విజయవాడ, శ్రీకాకుళం వంటి ముఖ్య ప్రాంతాలకు బస్సులు నడపనున్నాము. అమలాపురం నుంచి హైదరాబాద్‌కు సుమారు 15 , విజయవాడకు 20, విశాఖకు 30 చొప్పున ఏర్పాటు చేశారు. రద్దీకు అనుగుణంగా విజయవాడ, విశాఖపట్నం వరకు అదనపు సర్వీసులు నడుపుతాము.

**ఆర్‌టిసి నుంచి ప్రయాణికులకు ఏమైనా రాయితీలు ఇస్తున్నారా?**

ప్రయాణికులు రానుపోను టికెట్లు ముందుగానే రిజర్వేషన్ చేయించుకుంటే 10 శాతం రాయితీ కల్పిస్తాము. అలాగే 60 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజనులకు 10 శాతం రాయితీ ఇస్తున్నాము. ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే ఛార్జీలో 10 శాతం. రాయితీ ఉంటుంది. ఇప్పటికే




రిజర్వేషన్ల బుకింగ్ జరుగుతున్నాయి. ఈ ప్రత్యేక బస్సులు ఆయా డిపోల్లో సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

**ఛార్జీల వివరాలు తెలియజేయండి ?**

అమలాపురం నుంచి హైదరాబాద్ కు సూపర్ లగ్జరీ బస్సుకి రూ.762, ఇంద్ర ఎసి బస్ రూ.916, నైట్ రైడర్ ఎసికి రూ 1039, అమరావతి ఎసి బస్ రూ.1171 చొప్పున ఛార్జీలను వసూలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అలాగే విశాఖపట్నంకు రూ.386, విజయవాడకు రూ.312 చొప్పున ఛార్జీలను వసూలు చేస్తున్నాం.

**అమలాపురం నుంచిఅరుణాచలానికి బస్సుసర్వీస్ నడుపుతున్నారా ?**

ప్రయాణికులకు కోరిక మేరకు ప్రతి నెలా పౌర్ణమికి గిరి ప్రదక్షణ కొరకు అమలాపురం నుంచి అరుణాచలం బస్సు యాత్ర నడుపుతున్నాం సుమారు అరుణాచలం బస్ సర్వీస్‌కు రూ.3వేలు టికెట్ ధర నిర్ణయించారు. కార్తిక మాసం సందర్భంగా విహారయాత్రకు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా మన్యసీమ యాత్ర బస్ సర్వీస్ కూడా డిజైన్ చేశాము. ప్రయాణికులందరూ బస్సు సౌకర్యం ఉపయోగించుకుంటారని కోరుకుంటున్నాము.



కవి సంధ్య స్వర్ణోత్సవ సభలో పాల్గొన్న మల్లాడి కృష్ణారావు

## ఘనంగా కవిసంధ్య స్వర్ణోత్సవాలు

**ప్రజాశక్తి - యానాం**

కవిసంధ్య స్వర్ణోత్సవ సభ ఆదివారం స్థానిక గీతా మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సభకు కవిసంధ్య సంపాదకులు డాక్టర్ శిఖామణి అధ్యక్షత వహించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాశి విజయ భాస్కర్ సభను ప్రారంభించి మాట్లాడారు. ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజం చైతన్యవంతం కావడానికి సాహిత్యం దోహదపడుతుందని పేర్కొన్నారు. కవిసంధ్య కార్యక్రమాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించనున్నట్టు తెలిపారు. కవులను, కళాకారులను ప్రోత్సాహించ వలసిన అవసరం ఉందన్నారు. కేంద్రసాహిత్య అకాడమీ సభ్యురాలు, ఆచార్య డాక్టర్ మృణాళిని మాట్లాడుతూ శిఖామణి సాహిత్య కషిని కొనియాడారు. ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానం రాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి తదితరులు ప్రసంగించారు. సభలో శిఖామణి సాహితీ పురస్కారం సుప్రసిద్ధ కవి, విమర్శకులు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వాడ్రేవు చినవీరభద్రుడుకు ప్రదానం చేశారు. శిఖామణి తదితరులు ఘనంగా సత్కరించి, మెమోంటో, 10 వేల నగదు అందించారు. శిఖామణి యువపురస్కారాన్ని ప్రముఖ కవి పాయల మురళీకృష్ణకు ప్రదానం చేశారు. ఆయనను శిఖామణి సత్కరించి రూ.5 వేల నగదు అందించారు. 12 మందికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించి రూ.1016 చొప్పున నగదు అలాగే మెమెంటో అందించారు. వాడ్రేవు చినవీరభద్రుడును ప్రముఖకవి, విమర్శకులు డాక్టర్ సుంకర గోపాల్ పరిచయం చేశారు. పాయల మురళీ కృష్ణను ప్రముఖకవి, చరిత్రకారుడు బొల్లోజు బాబా పరిచయం చేశారు. డాక్టర్ శిఖామణి మాట్లాడుతూ ప్రస్థానంకు సంబంధించిన అంశాలను వివరించారు. ఇష్టం అయిన పనికి ప్రయాస ఉండదన్నారు. ముందుగా ప్రముఖకవి మదునాపంతుల సత్యనారాయణమూర్తి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. సుమారు 40 మంది కవులు తమ కవితలను చదివారు. కవిసంధ్య 50వ స్వర్ణోత్సవ సంచికను, మొదటి సంచికను ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆవిష్కరించారు. తొలి ప్రతిని ప్రముఖకవి, విమర్శకులు డాక్టర్ ఆర్.సీతారాం స్వీకరించారు. శిఖామణి కవితలను మలయాళంలో అనువదించిన సంపుటిని సభలో ఆవిష్కరించారు. సభలో ప్రముఖ కవులు, రచయితలు, సాహితీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# యాత్రికుల సౌకర్యాల కల్పనకు కృషి

**ప్రజాశక్తి - ఆత్రేయపురం**

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే యాత్రికులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని కొత్తపేట నియోజకవర్గ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం ఆయన వాడపల్లి దేవస్థానం ప్రాంగణంలో యాత్రికుల సౌకర్యార్థం పలు అభివద్ధి పనులను శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని దేవస్థానం అధికారులకు ఆదేశించిన నేపథ్యంలో ఈ అభివృద్ధి పనులు పూర్తి చేస్తారని తెలిపారు. రూ.10 లక్షలతో పార్కింగ్ ఏరియా వద్ద గోశాల విస్తరణ శంకుస్థాపనకు భూమి పూజ చేశారు. రూ.20 లక్షలతో పార్కింగ్ ఏరియా వద్ద టాయిలెట్స్ నిర్మాణానికి శంకుస్థాపన మరియు రూ.20 లక్షలతో ఉపాలయం భూమి వద్ద టాయిలెట్స్ బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలతో తాత్కాలిక అన్నదాన షెడ్డునకు ఫ్లోరింగ్ పనులకు శంకుస్థాపన అలాగే రూ.9లక్షల 50వేలతో అన్నదానం భవనం, దక్షిణం వైపు ఖాళీ స్థలం పూడ్చుట మరియు చదు ను చేయు పనులకు శంకుస్థాపన చేశారు. రూ.6లక్షలతో గృహ సంకల్పం ప్రదేశం వద్ద ఫ్లోరి ంగ్ పనులు చేయుటకు శంకుస్థాపన చేశారు. అలా గే రూ.1 కోటి 11లక్షలతో కాంపౌండ్ వాల్ మరి యు డార్మెటరీ హాల్ నిర్మాణ పనులకు శంకు స్థాపన లు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమి షనర్ నల్లం చక్రధర్రావు, ముక్కవల్లి రామం, ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాథం, కంఠంశెట్టి శ్రీనివాస్, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, మైగపుల గురవయ్య పాల్గొన్నారు.



వాడపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు

## ఆదిత్యలో ఉపాధి నైపుణ్య అభివృద్ధిపై శిక్షణ

**ప్రజాశక్తి-గండేపల్లి**

ఆదిత్యలో ఆదివారం ఉపాధి నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమం నిరహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 2013 నుండి 17 వరకు ఉత్తీర్ణులైన పూర్వ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యోగానికి సిద్ధంగా ఉండటం మరియు ఉపాధి నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేయాలి అనే అంశంపై కెరీర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.సాయి దేవన్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. సాయి దేవన్ మాట్లాడుతూ, కమ్యూనికేషన్ స్కిల్ డెవలప్మెంట్ స్కిల్స్ ఇంప్రూవ్ చేయాలంటే ముందు క్రమశిక్షణ, ఏమి చెప్పాలని అనుకుంటున్నామో వాటిని స్పష్టతతో విపులీకరించి చెప్పడం, ముఖ్యమైన సారాంశాలను సేకరించటం, మాతృభాషతో పాటు ఆంగ్లం, హిందీ, జర్మనీ, స్పానిష్ వంటి కొన్ని ఇతర భాషలపై పట్టు సాధించడం మంచిదన్నారు.

## బాణసంచా దుకాణాల పరిశీలన

**ప్రజాశక్తి- తాళ్లరేవు**

దీపావళి సామాగ్రి తయారు చేస్తున్న మందుగుండు దుకాణాలను ఆదివారం కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ, కోరంగి ఎస్ఐ సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం జి.వేమవరం గ్రామంలో ఉన్న పార్వతీ పరమేశ్వర ఫైర్ వర్క్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను సందర్శించి దుకాణదారులకు తగిన హెచ్చరికలు జారీ చేశారు. అనుమతులు లేకుండా ఎవరైనా దుకాణాలు నడిపినా, మందు గుండు సామాగ్రి కలిగి ఉన్నా రవాణా చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాచారాన్ని తెలియజేయాలని కోరారు.

## మరిడమ్మకు అభిషేకం

**ప్రజాశక్తి - పెద్దాపురం**

స్థానిక మరిడమ్మ అమ్మవారికి ఆదివారం మఖ నక్షత్రం సందర్భంగా అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో అష్టోత్తర అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

## సత్తిబాబు మరణం తీరని లోటు

**ప్రజాశక్తి- తాళ్లరేవు**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మెర్నీడి సత్తిబాబు మరణం తీరని లోటు అని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు (బూరిబాబు) అన్నారు. సత్తిబాబు ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను చిక్కాల ఆదివారం పరామర్శించారు. సత్తిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దూళిపూడి రామకృష్ణ, కుటుంబ సభ్యులు చోడిశెట్టి బాబీ, కనక శిరీష, పసుపులేటి ఉమహేశ్వరరావు, వెంకటలక్ష్మి, వానరాశి పద్మారావు, పుష్ప పాల్గొన్నారు.

## స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-కాకినాడ**

ది స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సర్వ సభ్యాసమావేశం జిల్లా విద్యాశాఖ సమావేశ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖదికారి పి.రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, డి.శ్రీరామ్, రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాస్ హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.రవికుమార్, సహాధ్యక్షులు చింతా సురేష్, వైస్ ప్రెసిడెంట్ ఎవి.ఉమామహేశ్వర రావు, సిహె.శ్రీనివాస్, ఎస్.నూకరాజు, కె.సత్యఉమాదేవి, జనరల్ సెక్రెటరీగా టి.శ్రీనివాస్, సెక్రెటరీగా జి.కామేశ్వరి, టి.రామసత్యానందం, కెవిజి.కృష్ణ రాజన్, ఆర్.సోమాలమ్మ, మహిళా సెక్రెటరీగా ఐ.శైలజా సుందరి, ట్రెజరర్‌గా పి దుర్గ మనోహర్, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఉద్యోగుల, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు అ న్నారు.

## హేమర్ త్రోలో సునందబాబుకు రజతం

**ప్రజాశక్తి - పెద్దాపురం**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో కర్నూలులో జరిగిన అండర్ -19 బాలుర అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి హేమర్ త్రో పోటీల్లో పెద్దాపురం మండలం రాయభూపాలపట్నం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి టి.సునంద బాబు ద్వితీయ స్థానం సాధించి రజత పతకం సాధించినట్టు పీడీ కామిరెడ్డి సుబ్రహ్మణ్యం తెలిపారు. సునంద బాబు డిసెంబర్ మొదటి వారంలో జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెడ్మాస్టర్ జి.మల్లేశ్వరరావు, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్యం చిన్న, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్, ప్రసన్న, ఉపాధ్యాయులు టి.మూర్తి, శామ్యూల్ జాన్ బాబు, వీరాంజనేయులు, విజయ్ కుమార్, అన్నపూర్ణ, షేక్ షరీఫా, రామకృష్ణ తదితరులు సునంద బాబును అభినందించారు.

## కార్యకర్తల సంక్షేమమే టిడిపి ధ్యేయం

**ప్రజాశక్తి-కాకినాడ రూరల్**

కార్యకర్తల సంక్షేమంలోనే తెలుగు దేశం పార్టీ బలమంతా ఉందని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మి అన్నారు. ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి నేమాం, పి.వెంకటాపురం గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. తొలుత నేమాంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీల్లో కార్యకర్తలు సంక్షేమం కోసం బీమా సౌకర్యం కల్పిస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం అని తెలిపారు. ప్రజలంత స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదులో పాల్గొంటున్నారని తెలిపారు. దీన్ని నూరుశాతం పూర్తి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## పార్కులో రెస్టారెంట్ ప్రారంభం

**ప్రజాశక్తి - పెద్దాపురం**

స్థానిక జగ్గంపేట రహదారిలో పాండవుల మెట్టపై నిర్మించిన శతాబ్ది పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను ఆదివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విత్తనాల వెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రంధి సత్యనారాయణ, తూతిక రాజు, రెస్టారెంట్ యజమాని నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జానకి రామచౌదరికి పురస్కారం

**ప్రజాశక్తి-కాకినాడ**

నగర సాహితీ స్రవంతి అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరికి కవి సంధ్య ప్రతిభా పురస్కారం లభించింది. ఆదివారం యానాం గీతాభవన్‌లో కవిసంధ్య సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన కవిసంధ్య పత్రిక స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. కవిసంధ్య ప్రతిభా పురస్కారాన్ని పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, సంపాదకులు శిఖామణి అందజేసి ఘనంగా సత్కరించారు.

## ముమ్మరంగా ఎంఎల్‌సి ఓటరు నమోదు

**ప్రజాశక్తి - పెద్దాపురం**

టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థి విజయం కోసం గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు విస్తతంగా గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు చేపట్టారు. రేలంగి బుజ్జి, రేలంగి వెంకట్రావు ఆదివారం మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న పట్టభద్రులు అందర్నీ గుర్తించి వారికి ఓటు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## 29న పెద్దాపురం మున్సిపల్ సమావేశం

**ప్రజాశక్తి - పెద్దాపురం**

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని 30 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

## రౌండ్ టేబుల్ సమావేశాల విజయవంతానికి పిలుపు

**ప్రజాశక్తి - అమలాపురం రూరల్ .**

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, వివక్షకు వ్యతిరేకంగా నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే రౌండ్ టేబుల్ సమావేశాలను విజయవంతం చేయాలని ప్రగతి నారి సంఘం మండల కమిటీ పిలుపునిచ్చింది. కామనగరువు పంచాయతీ కరక్కాయ పేటలో పిఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు బి.పద్మావతి అధ్యక్షన ఆదివారం ప్రగతి నారి సంఘం నూతన మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కమిటీని ఉద్దేశించి పద్మావతి మాట్లాడారు. మహిళల సమస్యలపై ఐక్యంగా పోరాడాలన్నారు.

### ఎపి పంచాయతీరాజ్ డిప్లమో ఇంజినీర్స్ అసోసియేషన్

## కాకినాడ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి - పిఠాపురం**

ఎపి పంచాయతీ రాజ్ డిప్లమో ఇంజినీర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షులుగా పిఠాపురం నియోజవర్గ పంచాయతీరాజ్ శాఖ డిఇఇ ఎస్.వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ఏపీ పంచాయతీ రాజ్ శాఖ డిప్లమో ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కె.రవీంద్ర వ్యవహరించారు. అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా టి.హేమవంతరావు, జనరల్ సెక్రెటరీగా టి.నూకరాజు, ఫైనాన్స్ సెక్రటరీగా ఎన్.కృష్ణమోహన్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఫైనాన్స్ సెక్రటరీ మురళి, లోకల్ ఎలక్షన్ అబ్జర్వర్ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.




నూతన అధ్యక్షుడు వెంకటేశ్వరరావుతో సభ్యులు

# నాడు కళకళ.. నేడు వెలవెల..

- నాలుగు నెలలుగా మూతపడిన కోటిపల్లి రేవు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- ప్రయాణాలు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి



ప్రయాణికులతో కళకళలాడిన కోటిపల్లి రేవు (ఫైల్ ఫోటో)

**ప్రజాశక్తి - రామచంద్రపురం**

కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం వెళ్లే ఫెర్రీ రేవు గత నాలుగు నెలలుగా మూతపడి ఉంది. ప్రతి ఏటా కోటిపల్లి గౌతమీ గోదావరి వరదలు రావడంతో జూలై నెల నుండి అక్టోబర్ వరకు రేవు మూతపడుతుంది. భారీ వర్షాలు వరదలతో ప్రయాణాలను నిలిపివేస్తారు. అయితే గోదావరి కి వరదలు తగ్గి నెల రోజులు అయినా నేటికీ రేవులో ప్రయాణాలు పునరుద్ధరించలేదు. దీనితో రామచంద్రపురం నియోజకవర్గం కాకినాడ పరిసర ప్రాంతాల ప్రజలు అమలాపురం వెళ్లేందుకు ఇక్కట్లకు గురవుతున్నారు.

### యానాం మీదుగా అమలాపురం వెళ్లాలంటే

యానాం మీదుగా అమలాపురం వెళ్లాలంటే 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. కోటిపల్లి రేవు మీదుగా ప్రయాణిస్తే సుమారు 30 కిలోమీటర్లు దూరం కలిసి వస్తుంది దీంతో పాటుగా సమయం ఆదా అవుతుంది. అమలాపురం వెళ్లే వర్తకులు, లంకలో పంటలు పండించే రైతులు, వ్యవసాయదారులు కూలీలు, ఎక్కువగా కోటిపల్లి గోదావరిలో ప్రయాణిస్తుంటారు. అయితే వరదలు తగ్గి నెల రోజులైనా ఎప్పటికీ ప్రయాణాలు పునరుద్ధరించకపోవడంతో రైతులు, కూలీలు, లంక భూముల వ్యవసాయదారులు వెంటనే రేవు పు నరుద్ధరించాలని కోరుతున్నారు. అయితే కోటిపల్లి బహిరంగ వేళ నిర్వహించిన వేలంపాటకు ఎవరు రాకపోవడంతో గత ఏడు నెలలుగా వేలం వాయిదా పడుతూ వస్తుంది. అసలు బహిరంగ వేలం జరుగుతుందా లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

### యానాం మీదుగా అమలాపురం వెళ్లాలంటే

మార్చి 2023లో రేవుకు బహిరంగ వేలం జరగవలసి ఉండగా అప్పటి మంత్రి స్థానికులతో కుమ్మక్కై రేవు పాటకు ఎవరు హాజరు కాకుండా చూడడంతో పాట వాయిదా పడింది. దీంతో కోటిపల్లి కి చెందిన రేవు నిర్వాహకులు బిక్కిన దుర్గారావు వెంకటేశ్వర ఆల్ కాస్ట్ సొసైటీ పేరుతో ప్రతినెలా రూ.6 లక్షలు కె. గంగవరం మండల పరిషత్తుకు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే జూలై నుండి వరదలు రావడంతో కోటిపల్లి రేవును మూసివేసి ప్రయాణాలు నిలిపివేశారు. ప్రస్తుతం గోదావరి వరదలు తగ్గిన ప్రయాణాలు పునరుద్ధరించలేదు. దీంతో మిగిలిన 6 నెలలు కాలానికి అంటే మార్చి వరకు బహిరంగ వేళ నిర్వహిస్తారని మండల పరిషత్తు అధికారులు దీనిపై బహిరంగ వేలానికి తేదీని ప్రకటించారు.

### నిబంధనల కారణంగా..

అయితే వేలంలో పాల్గొనే వ్యక్తులు కనీసం నిర్వహణలో ఐదేళ్లపాటు అనుభవం ఉండాలన్న నిబంధన వల్ల బహిరంగవేలానికి ఎవరు ముందుకు రావడంలేదని దీన్ని సవరించాలని పలువురు కోరడంతో జిల్లా కలెక్టర్ సెప్టెంబర్ లో జరగాల్సిన బహిరంగ వేలం వాయిదా వేశారు. దీనిపై పిఆర్ కమిషనర్ను ఈ నిబంధన సడలించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ లేఖ రాశారని అది వచ్చిన తర్వాత వేలం నిర్వహిస్తారని మండల అధికారులు తెలిపారు. ప్రస్తుతం గోదావరికి వరద నీరు తగ్గడంతో రేవు ప్రయాణాలు పునరుద్ధరించవలసి ఉంది అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకు కోటిపల్లి ముక్తేశ్వరం రేవు నుంచి పెద్ద ఎత్తున ప్రయాణికులు అమలాపురం చేరుకుంటారు. ప్రస్తుతం కార్తీకమాసం సమీపిస్తుండడంతో భక్తులు పెద్ద ఎత్తున కోటిపల్లి సోమేశ్వరాలయనకి గోదావరి స్నానాలకు వస్తుంటారు దీంతో వెంటనే రేవును పునరుద్ధరించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

### బహిరంగ వేలం ద్వారా రూ.70 లక్షల ఆదాయం

కోటిపల్లి గోదావరి రేవు పాట ద్వారా సుమారు రూ.70 లక్షల ఆదాయం సమకూరు తుంది. అయితే ప్రస్తుతం ఆదాయం కోల్పోవడం జరుగుతుంది. వెంటనే కోటిపల్లిలో రేవు ప్రయాణాలు పునరుద్ధరిం చాలని పరిసరప్రాంత ప్రజలు, జిల్లా వాసులు అధికారులు కోరుతున్నారు.

### ప్రయాణికులకు కనీస వసతులు కల్పించాలి



ప్రభుత్వానికి ప్రతి ఏడాది సుమారు రూ.70 లక్షల ఆదాయం సమకూరుస్తున్న కోటిపల్లి రేవులో ప్రయా ణికులకు కనీస వసతులు లేవు. అదేవిధంగా పంటు కోసం ప్రయాణికులు గంటల తరబడి ఎండలో నిలబడ వలసివలసి వస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం వారికి షెడ్లు కూడా వేయించలేదు. ప్రయాణికులకు షెడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. రేవులో ప్రయాణాలు వెంటనే పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా.

**- కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, గ్రామస్తుడు**

### కోటిపల్లి రేవుకు వంతెన నిర్మించాలి



కోటిపల్లి రేవులో ప్రయాణాలు పునరుద్ధరించాలి. ప్రతి ఏటా ఐదు నెలల పాటు రేవు మూసివేసి పరిస్థితులు కొనసాగుతున్నందున శాశ్వ తంగా వంతెన నిర్మించి ప్రయాణికుల సమస్యలు పరిష్కరిం చాలి. పలు రోడ్లు, ఏటిగట్టు రోడ్లు ధ్వంసం కావడంతో ప్రయాణికులు యానాం మీదుగా చుట్టూ తిరిగి అమలాపురం చేరుకోవడానికి అవస్థలు పడుతున్నారు. దీనికి అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి. కేంద్రం నిధులు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో కోటిపల్లి రేవులో అభివద్ధి పనులు ముందుకు సాగడం లేదు.

**-కర్రి చిట్టిబాబు, మాజీ సర్పంచ్**